క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు కొటేషన్లు ఆహ్వానం

చిత్తూరు రూరల్: దసరా ఉత్సవాలకు వివిధ ఏర్పాట్ల నిమిత్తం నిర్వహణదారుల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో అక్టోబర్ 15 నుంచి 25వతేదీ వరకు దసరా బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. ఇందుకు గాను ప్రత్యేక అలంకరణ, చలువ పందిరి, విద్యుత్ దీపాలంకరణ, వాయిద్యాలు, భజంత్రీ, పంబ వాయిద్యం, ప్రసాదం తయారీ, మోతగాళ్లు తదితర వాటి కోసం ఆసక్తి గల నిర్వహణదారులు ఈనెల 30వతేదీలోపు కొటేషన్లు పంపించాలని కోరారు.

మహిళా బిల్లుపై హర్షం

చిత్తూరు కార్పొరేషన్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టంపై బీజేపీ నాయకులు హర్షం తెలిపారు. స్థానిక మిట్టూరులో బుధవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు ఆధ్వర్యంలో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. నారీ శక్తి వందన్ చట్టం పేరుతో బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారని చిట్టిబాబు అన్నారు. ఇంటింటికీ మరుగుదొడ్లు, జన్‌ధన్, ఉజ్వల, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవన్‌జ్యోతి యోజన, పోషణ్ అభియాన్, మాతృ వందన, డిజిటల్ పేమెంట్స్, ట్రిపుల్ తలాక్ వంటి ఎన్నో పథకాలు 2014 నుంచి ప్రవేశపెట్టారన్నారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు సంతోషం వ్యక్తం చేశా రు. మహిళలకు పీఎం మోదీ ప్రభుత్వం ఇస్తో న్న గౌరవానికి ఈ బిల్లు ప్రవేశపెట్టడమే నిదర్శనమని నాయకులు శ్రీనివాసులు తెలిపారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలను ఇంటి ముంగిటకే చేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలో ని కొనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 80 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 1200 ఇళ్ల పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. మిగిలిన వాటిని లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. వాటితో పాటు లబ్ధిదారులందరూ ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంత నిర్మాణం కోసం రూ.6 వేలు అదనంగా అందజేస్తుందని చెప్పారు. ఇంకుడుగుంత నిర్మాణం తప్పనిసరని లబ్ధిదారులకు తెలియజేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, వర్క్ ఇన్‌స్పెక్టర్ స్టాన్లీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి

యాదమరి: మండల పరిధిలోని సచివాలయాల పరిధిలో నిర్వహించే ఉచిత వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. ఆయన బుధవారం వైద్య సిబ్బందితో ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందికి సేవలు నిర్వహించే కిట్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజలు సైతం సచివాలయాల వద్ద నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చురుగ్గా ఆరోగ్య సురక్ష సర్వే

తవణంపల్లె: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి దాత్రేయచౌదరి తెలిపారు. మండలంలోని సరకల్లు, పట్నం, పుణ్యసముద్రం పంచాయతీల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. పట్నం, పుణ్యసముద్రంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబ వివరాలను సమగ్రంగా సర్వే చేసి నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి రోగికి వైద్య సేవలు

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి, ప్రతి రోగికి వైద్యసేవలు అందజేయనున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. పేయనపల్లెలో బుధవారం 104 వైద్యసేవలను గ్రామంలో అందజేశారు. అనంతరం 67 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

పూజకు హాజరైన ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు,



ఉత్సవమూర్తులకు కర్పూర హారతి అందిస్తున్న ఆలయ అర్చకులు, పుర వీధులలో విహరిస్తున్న స్వామివారు





నెమలిపై గజాననుడి కటాక్షం

- పురవీధుల్లో నెమలి వాహనంతో ఊరేగింపు
- అలరించిన కేరళ నాటికలు, డ్రమ్స్‌లు
- తరలి వచ్చిన ఉభయదారులు





ఊరేగింపుగా కలశాలను తీసుకొస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారులు, (ఇన్‌సెట్) ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం, ధ్వజస్తంభానికి అలంకరించిన దర్భ

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం మయూరంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఉత్సవ విగ్రహాలకు మయూర వాహన సేవ ఉభయదారులు క్షీర కలశాలను శాస్త్రోక్తంగా ఊరేగింపుగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మయూర వాహన సేవ ఉభయదారుల కుటుంబ సభ్యులు కలసి క్షీర కలశాలను శివాలయం నుంచి కేరళ డ్రమ్స్, నాటికలు ప్రదర్శిస్తూ, మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో పాత నెమలి వాహనంతోపాటు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ అర్చకులకు అందించారు. ఆలయ అర్చకులు స్వామివారి అలంకార మండపంలో ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారుల కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఊరేగింపులో వైఎస్సార్ సీపీ నాయకులు

ఈ క్షీర కలశాల ఊరేగింపులో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. నెమలి వాహన ఉభయదారులు రెడ్డి వంశీయులు కావడంతో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, కాణిపాక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, సీనియర్ నాయకులు తలపులపల్లె బాబురెడ్డి, గణేష్ ప్రసాద్ రెడ్డి, ఐరాల, పూతలపట్టు మండల కన్వీనర్లు బుజ్జిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు జయచంద్రా రెడ్డి, రవి రెడ్డి, పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పౌరాణిక నాటకం, హరికథా గానం, భక్తి గీతాలు, భరతనాట్యం, సంగీతం భక్తులనే విశేషంగా ఆకట్టుకుంది.

యాగమూర్తికి ప్రత్యేక పూజలు

ఆలయంలోని యాగశాలలో యాగమూర్తికి అర్చకులు శేఖర్ గురుకుల్ ఉదయం యాగశాలలో కొలువుదీరిన యాగమూర్తికి శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు చేశారు. ఆలయంలో ధ్వజస్తంభానికి విదేశీ పుష్పాలతో సర్వాంగ సుందరంగా వాహన ఉభయదారులు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి దర్భ ఎందుకు?

ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజున ధ్వజస్తంభానికి చుట్టే దర్భమాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. భూతప్రేత పిశాచ, రాక్షసాదిగణాలు దరిచేరకుండా దేవతలు నివాసముండేందుకుగాను దర్భమాలను, విడిదర్భలను ధ్వజస్తంభానికి చుట్టూ అలంకరిస్తారు. ఇది దోష నివారణకు ప్రధానమైన శాసనం. సర్వశుభాలు కలగడానికి ఒక మంగళతోరణమని వైఖానస ఆగమం ఉపదేశం. విశిష్టమైన వనంలో సహజసిద్ధంగా పెరిగి, మంచి రోజు, తిథుల్లో నియమనిష్టలతో పగటిపూట మాత్రమే కోసిన దర్భను మాత్రమే ఇందుకు ఉపయోగించాలని శాస్త్రవచనం. కాణికాక ఆలయ సిబ్బంది 20 రోజుల ముందు పరిసర అటవీ ప్రాంతాల్లో, సమీప గుట్టల్లో ఈ దర్భను సేకరించి 200 మీటర్ల పొడవున కలిగిన దారం(కొడితాడు), 6 అడుగుల వెడల్పు, ఆరున్నర మీటర్ల పొడవు కలిగిన చాప, 10 కిలోల విడిదర్భను గతవారంలో సమర్పించారు. అంకురార్పణ సందర్భంగా దర్భలను ధ్వజస్తంభానికి అర్చకులే అలంకరింప చేసి ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన కొండ లీలారెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. ఆమె కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు ఉన్నారు.


స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు


నెల్లూరుకు చెందిన గోపాలకృష్ణ నాట్యమండలి భాస్కర్‌రావు శ్రీరామాంజనేయ నాటకం





ఆలయంలో కేరళ బృందాల నృత్య ప్రదర్శన, పుర వీధుల్లో కేరళ డ్రమ్స్, కాణిపాకంలో పూజాధి కార్యక్రమాలకు హాజరైన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

సమష్టి కృషితోనే మండలాభివృద్ధికి కృషి

తవణంపల్లె: అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సహకారంతో మండల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఒకతాటిపై నిలిచి జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం చేయాలని కోరారు. జగనన్నకు ప్రజాబలం మెండుగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతోపాటు పార్టీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ మాట్లాడుతూ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి సారథ్యంలో మండల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కిషోర్ రెడ్డి, కరీం, ఉమామహేశ్వర రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, బాబ్జీరెడ్డి, విక్రమ్‌రెడ్డి, రవిరెడ్డి, కృష్ణమూర్తి యాదవ్, మోహన్‌రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రకాష్, డేవిడ్, విజయ్, నిరంజన్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, పట్టాభిరెడ్డి, దామోదరం, వాసు, జనార్దన్, పరదేశి, రంజిత్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి

ఇన్‌చార్జి ఎంపీపీగా పట్నం ప్రతాప్ రెడ్డి

మండల ఇన్‌చార్జి ఎంపీపీగా బుధవారం పట్నం ప్రతాప్ రెడ్డి (ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి) పదవీ బాధ్యతలు చేపట్టారు. తవణంపల్లె ఎంపీపీ గీతారెడ్డి ఈ నెల ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు సెలవు పట్టారు. దీంతో రాష్ట్ర భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తవణంపల్లె వైస్ ఎంపీపీ–2గా కొనసాగుతున్న పట్నం ప్రతాప్ రెడ్డిని తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీపీగా నియయమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ సమక్షంలో ఎంపీపీగా పట్నం ప్రతాప్ రెడ్డి పదవీబాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ నియామక పత్రాన్ని ప్రతాప్ రెడ్డికి అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో అట్టహాసంగా పదవీబాధ్యతలు చేపట్టిన పట్నం ప్రతాప్ రెడ్డిని శాలువలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

వినాయకస్వామి కుంభాభిషేక మహోత్సవం


కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: మండలంలోని పెరుమాళ్లకుప్పం యానాది కాలనీలో బుధవారం వినాయకస్వామి కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కుంభాభిషేకానికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. వేదపండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ నిధులతో యానాది కాలనీలో వినాయక స్వామి దేవాలయం నిర్మించడం చాలా గర్వంగా ఉందన్నారు. ముందస్తు పూజ వినాయకస్వామికే అని ఇంతవరకు యానాదులకు గుడి లేకపోవడంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ దేవస్థానం వారు రూ.10లక్షలు వెచ్చించి వినాయకగుడి నిర్మాణం చేపట్టి నేడు కుంభాభిషేకం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, వెంకటేశులు రెడ్డి, సాయిక్రిష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప పడిపూజ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లో వెలసిన శ్రీ శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం పడిపూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 7 గంటలకు పూజ ప్రారంభమవుతుందన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని వారు పేర్కొన్నారు.

ఉండ్రాళ్లయ్యా.. వెళ్లిరావయ్యా!


పూతలపట్టు: లడ్డూను దక్కించుకున్న భక్తుడు


చిత్తూరు: నిమజ్జనానికి తరలివస్తున్న గణేశుడు

చిత్తూరు రూరల్: ఉండ్రాళ్లయ్యా.. వెళ్లిరావయ్యా అంటూ భక్తులు స్వామివారిని నిమజ్జనానికి సాగనంపారు. నగరంలో బుధవారం నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వీధుల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. తర్వాత కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. నగరంలోని పోలీస్ కాలనీలో బుధవారం రాత్రి గణేశుడి లడ్డూను వేలంపాటలో ఉమ అనే భక్తుడు రూ.18,200కు దక్కించుకున్నాడు.

ప్రశాంతంగా నిమజ్జనం

చిత్తూరు అర్బన్: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ అరుణ చెప్పారు. కట్టమంచి చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను బుధవారం రాత్రి కమిషనర్ పరిశీలించారు. నిమజ్జనానికి ఏర్పాటు చేసిన క్రేన్, చిన్న విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేసిన కొంటర్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్‌ను పరిశీలించారు.

బై బై గణేశా..

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల పాటు కొలువుదీరి ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

పూతలపట్టు: మండల కేంద్రంలో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మంగళవాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం 13 కిలోల లడ్డూను పూతలపట్టుకు చెందిన మల్లికార్జునశెట్టి రూ.27వేలకు వేలంలో సొంతం చేసుకున్నారు.









గుడిపాల: పానాటూరులో నిమజ్జనోత్సవం, చిత్తూరు: కట్టమంచి చెరువ వద్ద నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ, నిమజ్జనానికి తరలివస్తున్న భక్తులు, డప్పు వాయిద్యాలకు చిందులేస్తున్న యువకులు, ట్రాక్టర్‌లో తరలుతున్న పార్వతీ తనయుడు